# మగబిడ్డ




— బి. రఘురామరాజు


"డియర్ స్టూడెంట్స్! ఈ రోజు మన కళాశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీమతి పద్మావతమ్మ గారిని మీకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదని అనుకుంటున్నాను నేను. ఆంధ్రదేశంలో ఆమెను గురించి తెలియని వ్యక్తి లేడంటే అతిశయోక్తి కాదు. స్త్రీవాదాన్ని ఒక ఉద్యమంలా చేపట్టిన వ్యక్తి వారు. చెప్పేదాన్ని, స్వయంగా ఆచరణలో పెట్టే మహా మనీషి వారు. భార్య బ్రతికుందని తెలియజెప్పే చిహ్నాలేవీ మగవాడు ధరించనప్పుడు, భర్త జీవించే వున్నాడని తెలియజేసే అలంకారాల్ని ఆడది మాత్రం ఎందుకు ధరించాలి? అని గాజుల్ని, బొట్టుని, మట్టెల్ని పరిత్యజించిన ధైర్యశాలి ఆమె!" అని మిన్ను ముట్టిన కరతాళ ధ్వనులు తగ్గే వరకు ఆగి తర్వాత పద్మావతమ్మ వైపు తిరిగి చిర్నవ్వు నవ్వి,

"ఇలా పొగడడం వారికిష్టముండదని నాకు తెలుసు. కాబట్టి వారిని గురించి ఎక్కువగా మాట్లాడను. మనల్ని ఉద్దేశించి సందేశాన్ని అందివ్వాల్సిందిగా వారిని కోరుతున్నాను. విలువైన వారి మాటల్ని శ్రద్ధగా వినవలసిందిగా మీ అందరికీ నా మనవి!" అని మైకును పద్మావతమ్మగారి ముందుకు జరిపింది కాలేజీ ప్రిన్సిపాల్.

ఓసారి గొంతు సవరించుకుని, ప్రసంగించడం మొదలుపెట్టింది పద్మావతమ్మ.

"ప్రియమైన విద్యార్థినులారా! ఒక రకంగా చూస్తే మీరంతా మాకంటే ఎంతో అదృష్టవంతులు. మా రోజుల్లో జిల్లా కేంద్రంలో కూడా కాలేజీలు సరిగ్గా వుండేవి కావు. వున్నా ఆడపిల్లల్ని చదువుకోమని ఏ తల్లిదండ్రులూ ప్రోత్సహించేవాళ్ళు కాదు. మరిప్పుడు? చిన్న తాలూకా కేంద్రంలో కూడా మూడేసి నాలుగేసి కాలేజీలు వుంటున్నాయి. అప్పట్లో, పుష్పవతి అయితే చాలు, ఆడపిల్లలకు పెళ్ళిచేసే బాధ్యత తీర్చుకునే వాళ్ళు. తన భర్త ఎలా వుండాలో ఎంచుకునే స్వాతంత్ర్యం స్త్రీలకు ఇచ్చేవాళ్ళు కాదు.

"కావిప్పుడు! మీరు కోరుకున్న మగవాణ్ణి పెళ్ళాడే స్వేచ్ఛ మీకిస్తున్నారు




మీ తల్లిదండ్రులు. ఉద్యోగం సంపాదించడంలో, ఆటపాటల్ని నేర్చుకోవడంలో, చదువు సంధ్యల్లో– ఒకటేమిటి– అన్నింటిలో–అబ్బాయిలతో సమానంగా రాణిస్తున్నారు నేటి అమ్మాయిలు. కాని...ఇంత...ఇంత ప్రగతి సాధించినా స్త్రీ పురుషుల్ని భిన్నంగా చూసే చెడు సంప్రదాయం మన సమాజంలో ఇంకా కొనసాగుతుండడమే నాకు ఆవేదన కలిగిస్తోంది!

" 'మీకు పిల్లలెందరు' అని ఎవరినైనా అడిగితే ఒకబ్బాయి, ఒకమ్మాయి అని చెప్పడానికి వన్ 'ప్లస్' వన్ 'మైనస్' అని జవాబు చెప్తున్నారు నేటి తల్లిదండ్రులు! అమ్మాయిని 'మైనస్'గా ఎందుకు భావిస్తున్నారు వాళ్ళు? స్కానింగ్‌లో ఆడపిల్ల అని తేలితే చాలు, గొంతు నులిమి చంపేస్తున్నారు! ఆడపిల్ల అంటే ఎందుకీ చిన్నచూపు? ఆ చిన్నచూపు చూసే అలవాటు నశించేవరకు మనం పోరాటం కొనసాగిస్తూనే ఉండాలి!" ఉరకలు వేస్తున్న గోదావరిలా ఆమె ఉపన్యాసం కొనసాగుతున్న సమయంలో "మేడం!" అంటూ ఓ వ్యక్తి వచ్చి మెల్లగా పిలవడంతో ప్రక్కకు మళ్ళి చూసింది పద్మావతమ్మ.

ఈ ఆవేశపూరితమైన ఉపన్యాసానికి అంతరాయం కలిగించినందుకు, ఆమె ముఖంలో చిరాకు స్పష్టంగా కనబడింది.

"విజయవాడ నుండి మీకు ఎస్.టి.డి. మేడం! అర్జంటుగా రండి!" వినయంగా చెప్పాడు వచ్చిన వ్యక్తి. మెరుపు వేగంతో అడుగులు వేస్తూ, ఆఫీసు గది చేరుకుని రిసీవరు అందుకుందామె చటుక్కున.

"హలో! హ...లో! హ...లో!" అని అంచెలంచెలుగా స్వరం పెంచి, అప్పటికీ ప్రయత్నం ఫలించకపోవడంతో "ఏం ఫోన్లో ఏమిటో! వూరికే కలువుతుంటాయి!" అని విసుక్కుంటూ "ఫోనెత్తి మొదట మాట్లాడిందెవరు?" అని చుట్టూ చూసింది పద్మావతమ్మ.

"నేనే మేడం! ఒకవేళ సమయానికి మీరు లేకపోతే, అందజేయమని నాకు మెసేజ్ కూడా చెప్పారు. మీ పెద్దకోడలు అమ్మాయిని ప్రసవించిందట! తల్లీ, పాప ఇద్దరూ క్షేమంగా వున్నారట!" ఇందాక ఫోన్ వచ్చిందని వార్త తెచ్చిన వ్యక్తే చెప్పాడు హుషారుగా. దానికామె "ఆహా! అలాగా" 'వెరీ ఫైన్' అని తలూపుతూ నవ్వి, ఫోన్ మళ్ళీ మోగుతుందేమోనన్న ఆశతో అక్కడే ఎదురుచూడసాగింది.

ఈ లోపుగా అక్కడికి చేరుకున్న ప్రిన్సిపాల్, "బామ్మగారైన సందర్భంలో మా హార్టీ కంగ్రాచ్యులేషన్స్ మేడం!" అని అభినందించి "ఇంతకీ మా నోరేమైనా తీపి చేస్తున్నారా? లేదా?" అంటూ అడిగింది చనువుగా.

"ఓ యస్! తప్పకుండా! ఓ రెండు కిలోల స్వీట్స్ తెప్పించి స్టాఫ్‌కంతా పంచండి, ప్లీజ్!" అని పర్స్‌లోంచి ఓ రెండు వందకాగితాల్ని అందించింది పద్మావతమ్మ.

అయిదు నిముషాలు ఓపిగ్గా ఎదురు చూశాక, మళ్ళీ ఫోన్ మోగింది! ఏవిధమైన కంగారు, తొట్రుపాటు లేకుండా శాంతంగా రిసీవర్ ఎత్తింది పద్మావతమ్మ. 'ఊ, ఊ అలాగా" "వెరీనైస్" అని సంతోషంగా ఆమె ప్రతిస్పందించడం తప్ప, అవతలి నుండి ఏం మాట్లాడుతున్నారో ఏమీ అర్థం కాలేదు. అక్కడ గుమికూడిన వాళ్ళకు కాని ఫోన్ వింటున్నంతసేపు ఆమె ముఖంలో క్రమక్రమంగా విస్తరిస్తున్న వెలుగు మాత్రం స్పష్టంగా గోచరించింది వాళ్ళకు.

"కనీసం యిప్పుడైనా ఫోన్ బాగా వినబడిందా మేడం,

కుతూహలంగా అడిగింది ప్రిన్సిపాల్. "బాగా వినపడిందిలెండి!" అని సంతోషంగా జవాబిచ్చి "ఎవరయ్యా! ఇందాక ఫోన్ విన్నది?" అంటూ మెడ సాగదీసి గుంపులోకి పరిశీలనగా చూసిందామె. ఆ వ్యక్తి కనిపించగానే దగ్గరకు రమ్మని పిలిచి "సరిగా వినడం చేతకాకపోతే, ఊరుకోవాలంతేగాని ఒకదానికొకటి చెప్పి పారేయడమేనా?" అని చివాట్లు పెట్టి అంతలోనే నవ్వుతూ–

"మా కోడలికి పుట్టింది అమ్మాయి కాదట! అబ్బాయిట!" అని అందరి ముందూ గర్వంగా ప్రకటించి తర్వాత ప్రిన్సిపాల్ వైపు తిరిగి "ఇందాకా రెండు కిలోల స్వీట్స్ తెప్పించమని కదండీ చెప్పాను! వద్దు! మొత్తం పది కిలోల స్వీట్స్ తెప్పించి స్టాఫ్‌తోపాటు స్టూడెంట్స్‌కి కూడా పంచండి! బావుంటుంది!" అని మరో ఐదు వంద రూపాయిల నోట్లను అందించి హుషారుగా వేదికవైపు నడిచింది పద్మావతమ్మ.

ఉత్తేజకరమైన ఆమె ఉపన్యాసం వినడానికి మరోసారి సిద్ధమయ్యారు అక్కడి శ్రోతలు.

## మేధావి!

చక్రవర్తి ఔరంగజేబు మహామేధావి. యుద్ధాలు చేసి, ఎటువంటి రక్తపాతాలు జరక్కుండానే 17 రాజ్యాలను అవలీలగా గెల్చుకున్నారు. ఒక పెద్ద ఏనుగు మీద ఎత్తుగా అంబారీని ఏర్పాటుచేయించేవాడు. ఆ అంబారీలో పసువురంగులో వుండే తన కాలి చెప్పను వుంచేవాడు. ఆ ఏనుగును ఓ మావటివాడు రాజ్యాల సరిహద్దుల్లోకి తీసుకెళ్ళేవాడు. ఆయా రాజ్యాల రాజులు, కాళ్ళకు పాదరక్షలు కూడా ధరించకుండా వచ్చి ఆ ఏనుగుకు స్వాగతం చెప్పేవారు. ఆ విధంగా తమ లొంగుబాటును తెలియజేసేవారు. పిమ్మట ఏనుగు రాజుగారి నగరంలోకి వెళ్ళి ఆయన సింహాసనం ముందు నిలబడేది. కొందరు సైనికులు అంబారీలోని ఔరంగజేబు పాదరక్షను తీసి, సింహాసనంపై వుంచేవారు. అటుపై ఆ రాజు చక్రవర్తికి సామంతుడయ్యేవాడు. చూశారా ఔరంగజేబు తెలివితేటలు!

కె.పద్మకేశవమూర్తి